అతడు ఇబ్బందిగా  చూశాడు. "సర్లే చూద్దాం" అన్నాడు.

అతడు డాబామీదకు వెళ్ళేసరికి అక్కడ బల్లమీద డ్రింకు, గ్లాసులూ వున్నాయి.

తన గ్లాసులో వంపుకుని తాగుతూ కూర్చున్నాడు. పదినిముషాల తరువాత ఆమె వచ్చింది. పల్చటి నైటీలో ఆమె చాలాబావుంది. అందంకాదు కానీ దానికన్నా ఎక్కువగా ఆమె స్ట్రక్చర్.

ఆమె తెల్లటి తెలుపు కాదు. చామనచాయకన్నా ఒక పిసరు ఎక్కువ తెలుపంతే. కానీ ఎక్కడో ఏదో తెలియని అందం వుంది.

ఆమె కూల్‌డ్రింక్ పోసుకోవటం చూసి "అదేమిటి?" అని అడిగాడు.

"నాకు అది పెద్దగా సహించటం లేదు. మొన్న రాత్రంటే ఏదో తాగాను. ఏం? మీకేమన్నా ఇబ్బందా?"

"లేదులే. ఒక్కణ్ణీ అయితే నాకూ బోరు"

డాబామీదికి వంగిన కొబ్బరిచెట్టు గాలికి వూగుతూంటే అందమైన ఆడపిల్ల ఎక్సర్‌సైజు చేస్తున్నట్టు వుంది.

"నైటీ తీసెయ్యనా?" అని అడిగింది క్యాజువల్‌గా.

అతడు మామూలుగా తాగుతున్నాడు. ఏదో ఆలోచిస్తున్నాడు. ఆలోచిస్తూ తాగుతున్నాడు . ఆమె అన్నమాట మొదట సరిగ్గా అర్థం కాలేదు. కళ్ళు చిట్లించి చూశాడు.

సరిగ్గా వినపడలేదేమో అనుకుని "ఏమన్నావ్ ఇప్పుడూ?" అని అడిగాడు.

ఆమె నవ్వుతోంది.

“నైటీ తీసెయ్యనా అని అన్నావా?” నిర్ధారణ చేసుకోవటం కోసమన్నట్టు అడిగాడు.

ఆమె తలూపింది.

‘నీకేమయినా మతిపోయిందా? ఆరుబయట?’ అన్నట్టు చూశాడు.

“నేనిప్పుడు వ్రాస్తున్న కథలో భార్యభర్తలిద్దరూ కల్సి నగ్నంగా వంట చేస్తారు. ఈ రోజే ఆ చాప్టరు వ్రాశాను. ప్రాక్టికల్‌గా ఎలా వుంటుందో చూద్దామనిపించింది”.

“నాకభ్యంతరం లేదు. పైగా సంతోషిస్తాను కూడా” ఇంగ్లీషులో అన్నాడు.

ఆమె సుతారంగా నైటీ తీసేసింది.

కొబ్బరి చెట్ల మీద నుంచి వచ్చే గాలికి ఆమె భుజాలమీద జుట్టు కదుల్తోంది.

గ్లాసు ఎత్తి “చీర్స్” అన్నాడు.

ఆమె కూల్‌డ్రింక్ చేతుల్లోకి తీసుకుంది “రైల్వే కాంట్రాక్టు ఏమైంది?”.

“మినిస్టర్ చాలా లంచం అడుగుతున్నాడు. అంత ఇస్తే మాకు లాభం రాదు” అంటూ దాదాపు అయిదు నిముషాలు వివరాలన్నీ చెప్పాడు.

“అన్నట్టు చెప్పటం మర్చిపోయాను. వచ్చేనెల నా పుస్తకం ఆవిష్కరణ సభ వుంది. మీరూ రావాలి”.

“ నన్ను చంపకు. నాకు అలాంటి సభలంటే బోరు. పైగా అక్కడ నువ్వు స్టేజి మీద కూర్చుంటావు. నన్ను కింద కూర్చోపెడతారు”.

“అలా గట్టిగా అనకండి. స్త్రీ వాదులెవరయినా విన్నారంటే మిమ్మల్ని ఉరి తీస్తారు. అయినా మీరడిగినప్పుడు నేను టెన్నిస్ మ్యాచ్‌లకు రామూ? అదీ నాకు బోరే”.

“సరే చూద్దాంలే” కుర్చీ వెనక్కి వాలాడు. వెన్నెల కిరణపు నీడ తాలూకు గీత ఆమె వక్షోజాల మధ్య నిలువుగానూ పొత్తికడుపు మడత మీద అడ్డంగానూ పడుతోంది. అతడు చుట్టూ చూశాడు. ఎవరూ చూసే స్కోప్ లేదు. చాలా గమ్మత్తుగా వుంది ఆ అనుభవం.

“ఎలా వచ్చింది నీకీ ఆలోచన?”

“మీ వ్యాపారం పెంచుకోవటానికి ఎప్పుడూ రకరకాల పథకాలు ఎలా ఆలోచిస్తారో అలాగే మేం నిరంతరం ఆలోచిస్తూ వుంటాం. ఇది తట్టింది. ఇంతకీ ఎలా వుంది?”

“అద్భుతంగా వుంది. లేకపోతే చాలా మిస్ అయ్యేవాళ్ళం”

“థాంక్స్”

“క్రిందికి వెళ్దామా?”

“మీరింకా మొదటి పెగ్‌లోనే వున్నారు”

“చాలా టెంప్టింగ్‌గా వుంది”

“కొంచెం సేపుండండి. ఇలా మాట్లాడుకుంటూంటే బావుంది. మనం మొన్నరాత్రి ఒక టాపిక్ మధ్యలో వదిలేసేం కష్టాల్లో వున్నప్పుడు ఎక్కువ తాగడం గురించి” అంది.

అతడొక క్షణం ఆలోచించి “అవును, గుర్తొచ్చింది” అన్నాడు.

“అవసరమొస్తే మిమ్మల్ని మీరు కంట్రోలు చేసుకోగలనన్నారు”.

“అవును”

“ఈ రోజునుంచి మీ మామూలు కోటాకన్నా ఎక్కువ తాగనని ప్రామిస్ చేయగలరా?”.

అతడు నవ్వి “ఏ భార్య అయినా భర్తతో ఈ రోజు నుంచీ తాగనని ప్రామిస్ చెయ్యండీ అంటుంది. నువ్వేమిటి కోటా కన్నా ఎక్కువ తాగకండి అని అడుగుతున్నావ్” అన్నాడు ఏడిపిస్తున్నట్టు.

“నా ప్రశ్నకి సమాధానం అదికాదు”.

అతడు లేచి ఆమె నడుము పట్టుకుని పైకి లేపుతూ “వెళ్దాం పద” అన్నాడు.

అతడి ఒళ్ళు వెచ్చగా తగిలింది.

ఆమె నైటీ గచ్చుమీదనించి తీసి టవల్‌లా భుజాన వేసుకుంటూ “ఇంతకీ నా ప్రామిస్ సంగతి?” అని అడిగింది.

అది తేల్తేగానీ క్రిందకి రానన్నట్టు.

“దీనిమీద ఒట్టు లిమిట్‌లోనే వుంటాను సరేనా” అంటూ క్రిందకి బయల్దేరాడు ఆమె చెయ్యి విదిలించికొట్టాక.

“మల్లెపూలు కార్లోనే వుండిపోయాయి” క్రిందకి వెళ్ళాక అంది

“వాటి సంగతి రేపు చూసుకుందాంలే”

తరువాత దాదాపు గంటసేపు వాళ్ళు శరీరాల్తో మాట్లాడుకున్నారు.

స్త్రీ పురుషుల మధ్య సెక్స్ కన్నా బెస్ట్ కమ్యూనికేషన్ మరేదీ లేదని నిరూపించే పద్ధతిలో.

“ఇవ్వాళ చాలా కొత్తగా వున్నావ్. ఏమిటి విశేషం?”

“ఏదో మనోవిశ్లేషణ పుస్తకంలో చదివాను. చేతులు, పెదవులు, వేళ్ళు, నాలుక, మొత్తం శరీరం మొగవాడితో రొమాన్స్‌లో ఎంత యాక్టివ్‌గా కదుల్తాయో ఆ పనులన్నీ అప్పుడప్పుడూ స్త్రీకూడా చేస్తే అది చాలా గొప్పగా వుంటుందట”.

“నాకర్థం కాలేదు. సరిగ్గా చెప్పు”.

“మొగవాడు చేసే పనులన్నీ సరిగ్గా అదే పద్ధతిలో స్త్రీకూడా చేస్తే చాలు అంతకన్నా గొప్ప రొమాన్సు మరేమీ ఉండదు”.

అతడు గట్టిగా నవ్వి “కరెక్ట్ ఒక్కమాటలో భలే చెప్పావు” అన్నాడు.

ఆమె కళ్ళు మూసుకుంది ఆర్నెల్లక్రితం అతడన్న ఒకమాట.... శవంలా పడుకోవటం తప్ప..... ఆ మాట గుర్తొచ్చింది.

ఆమె ఆలోచనలో పడటం చూసి “ఏమిటాలోచిస్తున్నావ్?” అని అడిగాడు.

“ఒక నెలరోజులపాటు ఎక్కడన్నా తిరిగివద్దాం. ఈ టెన్షన్లూ ఇవీ ఎప్పుడూ వుండేవే”.

“వచ్చేనెల ఎలాగూ అమెరికా వెళ్ళాలి. రెండు టిక్కెట్లు బుక్ చేసే వున్నాయి. నువ్వు రా”

రెండో టికెట్ ఎవరికోసం బుక్ చేసి వుంచారు? అని అడగలేదు అతడిని ఇబ్బంది పెట్టటం ఇష్టం లేక.

“అయితే ఒక్క షరతు. చాలా ఇష్టంగా తీసుకెళ్ళాలి” అంది.

అతడు అర్థం కానట్టు “ఇష్టంగా తీసుకువెళ్ళటం, అయిష్టంగా తీసుకువెళ్ళటం అని రెండు రకాలుంటుందా?” అన్నాడు.

“చాలా మంది భర్తలు తమ భార్యల్ని ఒక బాధ్యతలాగా బయటికి తీసుకెళ్తారట లెండి”.

అతడు మొహం చిట్లించి "నాకలాంటి హిపోక్రసీలేమీ లేవు. ఇష్టం లేకపోతే మొహం మీద చెప్పేస్తాను" అన్నాడు.

"తెలుసు మహానుభావా, ఇన్నాళ్ళు సంసారం చేశాను. ఆ మాత్రం తెలీదా" మనసులో అనుకుంటూ పైకి అంది "నా తరువాత కథకి టైటిల్ దొరికింది".

"ఏమిటది?"

"మనింటి పుల్లకూర"

**ఉపసంహారం**

"ఎలా జరిగింది మీ విదేశీ ప్రయాణం?" మధూహ అడిగింది.

"అద్భుతం" నవ్వింది లక్ష్మి.

ఆమె మొహంలో ఆ వెలుగు కొట్టొచ్చినట్టు కనపడుతూంది.

" ...... భార్యాభర్తలిద్దరూ కనీసం మూడు సంవత్సరాల కొకసారయినా పది పదిహేనురోజులపాటు పిల్లల్ని కూడా వదిలేసి బయట ఊళ్ళు తిరిగిరావటం దాంపత్య ఆరోగ్యానికి మంచి టానిక్ అని ఈసారి నవలలో వ్రాద్దామనుకుంటున్నాను."

"నీలో ఒక మార్పు మాత్రం కొట్టొచ్చినట్టు కనపడుతోంది"

"ఏమిటి మధూ"

"ఈమధ్య ఎప్పుడూ నవ్వుతూ ఉంటున్నావు. గతంలో అలా వుండేదానివి కాదు".

లక్ష్మి నవ్వింది "దానికేంగానీ, నీ విశేషాలు ఏమిటి చెప్పు. ఈ నెల రోజులూ ఏం చేశావ్?".

"చాలా పెద్ద విశేషమే వుంది" అంటూ బ్యాగ్‌లోంచి శుభలేఖలు తీసింది మధూహ.

లక్ష్మి సన్నగా కేకపెట్టినట్టు "వ్యావ్" అంది. " ...... చాలా ఆశ్చర్యకరమైన ...... సంతోషకరమైన విశేషమే. కంగ్రాట్స్" అంటూ చేతులు పట్టుకుని ఊపేసింది. అయితే మధూహ మొహం నిర్వికారంగా వుంది.

శుభలేఖ చదవటం ప్రారంభించిన లక్ష్మి మొహంలో మార్పు చోటు చేసుకుంది. చేయి అప్రయత్నంగా వణికింది. నమ్మలేనట్టు మధూహ మొహంలోకి చూస్తూ " ఇది ...... ఇదేమిటి ...... నువ్వు ...... రాజు ...... " అంటూ మళ్ళీ శుభలేఖ పరిశీలిస్తూ అపనమ్మకంగా " ...... నువ్వూ ప్రహసిత్ పెళ్ళి చేసుకుంటున్నారా?" అని అడిగింది.

"అవును. కలిసి వుండబోతున్నాం"

లక్ష్మి స్థబ్దురాలైంది. అక్కడ అకస్మాత్తుగా నిశ్శబ్దం రాజ్యమేలింది.

లక్ష్మి మొహంలో మారిన భావాల్ని మధూహ గమనించింది అర్థం చేసుకోగలిగింది కూడా. సన్నటి స్వరంతో నెమ్మదిగా అంది. "ప్రేమగురించి అన్ని గొప్ప గొప్ప కబుర్లు చెప్పిన మనిషి ఇలాటి పని చేస్తున్నాడేమిటా అనుకుంటున్నావ్ కదూ".

లక్ష్మి మాట్లాడలేదు. కానీ ఆమె మనసులోని అలజడి అంతా మొహంలో కనపడుతూంది.

మధూహ గిల్టీగా ఫీలయ్యింది.

"ప్రహసిత్ విశిష్టమైన వ్యక్తి! అటువంటి వాళ్ళు ప్రపంచంలో ఒకరో ఇద్దరో వుంటారు " అంది.

లక్ష్మి తల దించుకుని “నన్ను కొంచెంసేపు ఒంటరిగా వుండనివ్వు మధూ. ప్లీజ్” అంది ఆ ప్రసక్తి ఇష్టంలేనట్టు.

“లేదు. ఇదంతా నీకు తెలియాలి. నీ మనసులో ప్రహసిత్ పట్ల ఏ విధమైన విరక్తి భావమూ కలుగకముందే నీకు అతడి గురించి చెప్పాలి. మొదట్లో అతడి తొలి ...... చూపు ప్రేమ గురించి నేనూ తేలిగ్గా అనుకున్నాను. కానీ నీపట్ల అతడి ప్రేమ అనిర్వచనీయం. అజరామరం. దాన్ని మాత్రం తేలిగ్గా అంచనా వేయకు లక్ష్మీ ...... ”

“ఓహో ...... అతడి ప్రేమ గురించి అంత లోతుగా అప్పుడే తెలిసిందా నీకు?”

“అవును తెలిసింది. ” ధృఢంగా చెప్పింది మధూహ. “ ...... నిన్ను ప్రేమించి, నువ్వు వివాహితురాలివని తెలిసి, తన మనసు తలుపులు మూసేసుకున్నప్పుడే తెలిసింది. నువ్వు నీభర్తతో ప్రస్తుతం సుఖంగా వుంటున్నావని చెప్పినప్పుడు అతడి మొహంలో స్వచ్ఛమైన ...... నిజాయితీతో కూడిన ఆనందం కనిపించింది లక్ష్మీ! నేను చాలా గమనించి చూశాను. కేవలం ప్రేమలో ఋష్యత్వం సాధించిన వ్యక్తులకే అది సాధ్యం. తను ప్రేమించిన వ్యక్తి, తన పరోక్షంలోనో ...... లేక మరోవ్యక్తి సమక్షంలోనో ...... సంతోషంగా వుంటోంది అని తెలిసినప్పుడు ...... దాన్ని సంతోషంగా తీసుకోగలిగేటంత స్వార్ధరహితమైన ప్రేమ కన్నా గొప్పది ఈ ప్రపంచంలో మరొకటి వుంటుందంటావా? మనుష్యుల్లో ...... ముఖ్యంగా మగవాళ్ళలో ఆ మాత్రం స్వార్ధం వుండటం చాలా సహాజమైన ప్రక్రియ కాదా? నీకు తెలీదు లక్ష్మీ! హీ ఈజ్ గ్రేట్ ...... అతడు మళ్ళీ నిన్ను జీవితంలో కలుసుకోకపోవచ్చు. లేదా కలుసుకున్నా ఒక అపరిచత వ్యక్తి లాగానే మిగిలిపోవచ్చు. కానీ జీవితంలో అతడు మరెవర్నీ ప్రేమించడు. ప్రేమించలేడు.”

“కానీ నిన్ను మాత్రం వివాహం చేసుకుంటాడు.”

“అవును. చేసుకుంటాడు ...... ”

“గతప్రేమ గురించి గొప్పగా సమర్ధించుకుంటూ నీతో కలిసి కాపురం చేస్తాడు ...... ”

“గొప్ప వ్యంగ్యంగా మాట్లాడుతున్నాననుకోకు”

“ఏం? ఎందుకు మాట్లాడకూడదు? మనుష్యులంతా చేసేది అదేగా. రొమాంటిసైజింగ్ దీ పాస్ట్”

“నువ్వు నీ భర్తతో సుఖంగా వుంటూ కూడా, అతడు నన్ను వివాహం చేసుకోబోతున్నాడంటే ఈర్ష్య పడుతున్నావ్. అతడిని మర్చిపోయి నువ్వు నీ సంసారం చక్కదిద్దుకుంటున్నావంటే అతడు సంతోషిస్తున్నాడు. దీన్నిబట్టే తెలియటం లేదూ ఎవరు గొప్పో?”

“నాకు నీ జడ్జిమెంటు అవసరం లేదు. ఇప్పుడు నువ్వు అతడికి లభించావు కాబట్టి గతప్రేమ గురించి ఎన్ని కబుర్లయినా చెపుతాడు. అయినా ఎందుకతన్ని అంత సమర్థిస్తున్నావ్? కాబోయే భర్త అనా?”.

“కాదు. పుట్టబోయే నా బిడ్డకు తండ్రని ...... ”

ఆవేశపు శిఖరంనుంచి ఒక్కసారిగా జారి పడినట్టయింది. విస్తుబోయి “ ...... మధూ” అంది లక్ష్మి.

“అవును. కేవలం లోకం బారినుంచి నన్ను రక్షించటానికి! సమాజంలో ఒక గౌరవప్రదమైన స్థానం కల్పించటానికి ...... ”

“కానీ ...... కానీ ...... రాజు ...... ??”

జరిగినదేమిటో మధూహ చెప్పటం ప్రారంభించింది. కొంత జరిగింది ...... కొంత వూహించిందీ ......

ఆమె చెప్పిందంతా శ్రద్ధగా విన్నాడు ఇన్‌స్పెక్టర్ భైరవమూర్తి. విశాల్ పేరు చెప్పినప్పుడు అతడి భృకుటి ముడివడింది. “ ...... మీరు చెప్పిన మోసాలన్నీ అక్కడ జరుగుతూ వుండవచ్చు. కానీ వీటిలో కనీసం ఒకదాన్ని అయినా మనం నిరూపించలేం ...... ”

"ఇంతకాలం నేను చాలా వివరాలు సేకరించాను ఇన్‌స్పెక్టర్ గారూ. కానీ అవన్నీ బయటనుంచి సేకరించిన వివరాలే. ఇప్పుడు నేనే ఆ విషవలయంలో ప్రవేశిద్దామనుకుంటున్నాను."

"ఎలా?"